
సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు
మంగళవారం, 2, సెప్టెంబర్, 2025



సోమశిలలో 62.650 టీఎంసీలు
సోమశిల: జలాశయంలో సోమవారం నాటికి 62.650 టీఎంసీలు ఉన్నాయి. ఎగువ నుంచి 23,031 క్యూసెక్కుల వరద వచ్చి చేరుతోంది.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రా)	రూ.1,07,440
22 క్యారెట్ల ఆర్నమెంట్ (గ్రా)	రూ.9,688
3 శాతం జీఎస్టీతో	రూ.9,979
నవర (8 గ్రా)	రూ.79,832

గరిష్టం/కనిష్టం
33.6 /27.6

వాతావరణం
జిల్లాలో మంగళవారం ఆకాశం పాక్షికంగా మేఘావృతంగా ఉంటుంది. అక్కడక్కడ చిరు జల్లులు కురిసే అవకాశం ఉంది. సోమవారం గాలిలో తేమ 59 శాతంగా నమోదైంది.

న్యూస్‌రీల్

ఇన్‌చార్జి డీఆర్‌ఓగా విజయకుమార్



బాధ్యతలు స్వీకరించిన విజయ్‌కుమార్

నెల్లూరు రూరల్: జిల్లా ఇన్‌చార్జి రెవెన్యూ అధికారిగా విజయ్‌కుమార్‌కు కలెక్టర్ ఓ ఆనంద్ సోమవారం అదనపు బాధ్యతలు అప్పగించారు. ఇప్పటి వరకు ఇన్‌చార్జి డీఆర్వోగా ఉన్న హుస్సేన్‌సాహెబ్ ఉద్యోగ విరమణ చేయడంతో ఆ స్థానంలో జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారిగా ఉన్న విజయ్‌కుమార్‌ను నియమించారు. విజయకుమార్ గతంలో కోవిడ్ సమయంలో నోడల్ ఆఫీసర్‌గా పనిచేశారు.

సర్పంచ్ చెక్‌పవర్ రద్దు

పొదలకూరు: పొదలకూరు మేజర్ పంచాయతీ సర్పంచ్ మల్లిక చిట్టెమ్మ చెక్‌పవర్‌ను రద్దు చేస్తూ డీపీఓ శ్రీధర్‌రెడ్డి సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. పంచాయతీ నిధులను సర్పంచ్ దుర్వినియోగం చేసినట్టు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఈ ఏడాది జనవరిలో సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి, స్థానిక టీడీపీ నేతలు పంచాయతీ నిధుల దుర్వినియోగంపై ఫిర్యాదు చేసిన నేపథ్యంలో డీఎల్‌పీఓ ద్వారా విచారణ నిర్వహించగా నిధుల దుర్వినియోగం జరిగినట్లు రుజువైనట్లు పేర్కొన్నారు. ఆరు నెలల పాటు నిధులు డ్రా చేసే అధికారం లేకుండా చెక్‌పవర్ రద్దు చేసినట్టు తెలిపారు. అయితే సర్పంచ్ చిట్టెమ్మ మాట్లాడుతూ రాజకీయ దురుద్దేశంతోనే తన చెక్‌పవర్ రద్దు చేయించారని ఆరోపించారు. పంచాయతీ నిధులు ఎక్కడా దుర్వినియోగం కాలేదని తమ వద్ద నిధుల ఖర్చుకు సంబంధించి ఆధారాలు ఉన్నట్లు వెల్లడించారు.

టీజీపీ ఇన్‌చార్జి స్పెషల్ కలెక్టర్‌గా ఆసిఫా

నెల్లూరు (అర్బన్): తెలుగుగంగ ప్రాజెక్ట్ ఇన్‌చార్జి స్పెషల్ కలెక్టర్‌గా డిప్యూటీ కలెక్టర్ ఆసిఫాను నియమిస్తూ కలెక్టర్ ఆనంద్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటి వరకు టీజీపీ స్పెషల్ కలెక్టర్‌గా ఉన్న హుస్సేన్‌సాహెబ్ ఉద్యోగ విరమణ చేయడంతో ఆ స్థానంలో ఆమెను నియమించారు. ఆసిఫా ప్రస్తుతం ఫారెస్ట్ సెటిల్‌మెంట్ ఆఫీసర్‌గా పని చేస్తున్నారు. కలెక్టర్ ఉత్తర్వులతో ఇప్పుడు అదనంగా టీజీపీ ఇన్‌చార్జి స్పెషల్ కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించనున్నారు.

ఉదయగిరి ఏఎంసీ చైర్మన్ నియామకంపై కోర్టు స్టే

ఉదయగిరి: ఉదయగిరి మార్కెట్ కమిటీ చైర్మన్ నియామకంపై హైకోర్టు స్టే విధిస్తూ మధ్యంతర ఉత్తర్వులిచ్చింది. ఉదయగిరి ఏఎంసీ చైర్మన్ పదవి మొదట ఓసీ మహిళకు కేటాయించారు. అయితే కలెక్టర్ గత నెల 14న జనరల్‌కు కేటాయిస్తూ ఉత్తర్వులిచ్చారు. అదే రోజు సాయంత్రం ఓసీ మహిళకే కేటాయిస్తూ మరో ఉత్తర్వు ఇచ్చారు. జలదంకి ఎంపీటీసీ కుట్టుబోయిన మాధవరావు బీసీలకే చైర్మన్ పదవి కొనసాగించాలని హైకోర్టును ఆశ్రయించడంతో స్టే విధించింది. ఈ నెల 3వ తేదీలోపు కౌంటర్ దాఖలు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించింది. ఈక్రమంలో బీసీ నేతలు బి.మాధవరావు, శ్రీనివాస్ యాదవ్, లలితారం యాదవ్ సోమవారం గ్రీవెన్స్‌లో కలెక్టర్‌ను కలిసి ఏఎంసీ చైర్మన్ పదవి బీసీలకే కేటాయించాలని కోరుతూ వినతి పత్రం అందజేశారు.

ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే కఠిన చర్యలు



భూములను పరిశీలిస్తున్న రెవెన్యూ సిబ్బంది

సాక్షి ఎఫెక్ట్..

మర్రిపాడు: మండలంలో ప్రభుత్వ భూములు ఆక్రమించే వారు ఎంతటి వారైనా సరే కఠిన చర్యలు తీసుకుంటామని రెవెన్యూ అధికారులు కబ్జాదారులను హెచ్చరించారు. 'సాక్షి'లో సోమవారం ప్రచురితమైన 'ప్రభుత్వ భూములు హాంఫట్' కథనానికి అధికారులు స్పందించారు. ఆర్‌ఐ సాయికిరణ్, పెగళ్లపాడు వీఆర్‌ఓ శ్యాం, సర్వేయర్లు పెగళ్లపాడులోని ఆయా సర్వే నంబర్లలోని ఆ భూములను పరిశీలించి ఎవరైనా ప్రభుత్వ భూముల్లో దిగితే కఠిన చర్యలు తీసుకుంటామని, పోలీసు కేసులు కూడా నమోదు చేయిస్తామని హెచ్చరించారు. ఈ సందర్భంగా పలువురు లబ్దిదారులకు తమ ఈ భూములకు సంబంధించి పట్టాలిచ్చి ఉన్నారని అధికారులకు దృష్టికి తీసుకురావడంతో ఆ పట్టాలను తీసుకుని వచ్చి వెబ్ ల్యాండ్‌లో భూమిపై హక్కులు సరిచూసుకోవాలని సూచించారు. వెబ్ ల్యాండ్‌లో భూమి లేకుండా ఎవరైనా దిగితే వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

చరిత్రకొక్కడు..



వైఎస్సార్.. ఈ పేరు వింటే అన్నదాతే కాదు.. పుడమి తల్లి పులకిస్తోంది. వర్షపు నీటిని ఒడిసి పట్టి సాగుకు మళ్లించిన అపర భగీరథుడు. సింహపురి సిగలోని జలనిధి నుంచి జిల్లా నలుమూలలకు గంగమ్మను ఉరకలెత్తించారు. బంజరు భూములకు జలసిరులు అందించి బంగరు భూములుగా మార్చిన పాలక కర్షకుడు. జలయజ్ఞంతో డెల్టానే కాకుండా మెట్టలో ముక్కారు పంటలతో అన్నపూర్ణగా తీర్చిదిద్దారు. ఉమ్మడి జిల్లా తీరంలో మధ్య భాగంగా కృష్ణపట్నంలో పోర్టు నిర్మించి ప్రపంచ స్థాయి పటంలో నెల్లూరుకు స్థానం కల్పించిన భవిష్యత్ స్వాప్నికుడు. పవర్ ప్రాజెక్టులతో ఉమ్మడి జిల్లాలో వెలుగులు నింపిన వెన్నెల రేడు. పారిశ్రామిక సెజ్‌లతో విదేశీ సంస్థలను స్థాపించి అభివృద్ధికి బీజాలు వేసిన పాలికుడు. నిరుద్యోగాన్ని రూపు మాపి లక్షల కుటుంబాల్లో సంతోషాన్ని నింపిన వల్లభుడు. దశాబ్దన్నర కాలం గడిచినా జిల్లా అన్నదాతల మదిలో రాజన్న స్థానం పదిలం.

జిల్లాకు జలసిరులు అందించిన జలయాజ్ఞికుడు

- కృష్ణపట్నం పోర్టుతో భవిష్యత్‌ను కాంక్షించిన స్వాప్నికుడు
- విద్యుదుత్పత్తి కేంద్రాలతో వెలుగులు నింపిన వెన్నెల రేడు
- శ్రీసిటీ, మాంబట్టు, మేనకూరు పారిశ్రామికవాడలతో అభివృద్ధికి బీజాలు వేసిన పాలికుడు
- లక్షల మందికి ఉద్యోగ, ఉపాధి కల్పించిన వల్లభుడు
- సింహపురి అభివృద్ధిలో రాజన్న ముద్ర
- నేడు మహానేత వైఎస్సార్ వర్ధంతి

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: డాక్టర్ యెడుగూరి సందింటి రాజశేఖరరెడ్డి 5 ఏళ్ల 3 నెలల ముఖ్యమంత్రి పరిపాలనలో చేసిన అభివృద్ధి, అమలు చేసిన పథకాలు చరిత్రకొక్కడుగా చిరస్మరణీయం అయ్యారు. ఆ పెద్దాయన ప్రజల నుంచి దూరమై 16 వత్సరాలు గడిచిపోయినా.. నేటికీ జనం గుండెల్లో గూడు కట్టుకునే ఉన్నారు. క్రీ.పూ. క్రీ.శ. అన్నట్లు.. రెండు తెలుగు రాష్ట్రాల్లో పరిపాలనలోనూ, అభివృద్ధిలోనూ వైఎస్సార్ ముందు, వైఎస్సార్ తర్వాత అంటూ అభివర్ణిస్తూ, విశ్లేషిస్తున్న పరిస్థితిని చూస్తున్నాం. ఆ కోవలోనే నెల్లూరు జిల్లాలో వైఎస్సార్ చేసిన అభివృద్ధి అజరామరంగా నిలిచిపోయాయి.

అన్నపూర్ణగా ఖ్యాతిగాంచిన సింహపురిని జలసిరిగా మార్చిన జలయాజ్ఞికుడు. దాదాపు మూడు దశాబ్దాలకు పైగా నిర్లక్ష్యానికి గురైన సాగు నీటి ప్రాజెక్టులను పూర్తి చేసేందుకు వందల రూ.కోట్లతో పునాదులు వేసి జలయజ్ఞానికి శ్రీకారం చుట్టిన పాలక కర్షకుడు. 2004 ఎన్నికలకు ముందు వైఎస్సార్ చేపట్టిన పాదయాత్ర తర్వాత జిల్లాలో బస్సు యాత్రలో అడుగడుగునా అన్నదాతలు తమ గోడును వెళ్లబోసుకున్నారు. ముఖ్యమంత్రి అయ్యాక జిల్లాలో సాగునీటిపై పూర్తిస్థాయిలో దృష్టి సారించారు. జలయజ్ఞం ద్వారా వందల రూ.కోట్లతో సమగ్ర సోమ శిల నుంచి పెన్నా, సంగం బ్యారేజీల నిర్మాణం వరకు అన్నింటికి ఆయన అంకురార్పణ చేశారు.

వృథా నీటిని ఒడిసి పట్టి..

వృథాగా సముద్రంలో కలుస్తున్న కృష్ణా నది వరద నీటిని శ్రీశైలం డ్యాం నుంచి కరువు ప్రాంతమైన రాయలసీమకు కేవలం 1,500 క్యూసెక్కుల తరలించేందుకు గతంలో ఉన్న పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ సామర్థ్యాన్ని అధికారికంగా 44 వేల క్యూసెక్కులని చెప్పినా వాస్తవంగా 1.10 లక్షల క్యూసెక్కుల సామర్థ్యంతో రోజుకు దాదాపు 10 టీఎంసీలు తరలించే విధంగా అభివృద్ధి చేశారు. పెన్నార్ డెల్టాతో పాటు మెట్ట ప్రాంత భూములను సస్య శ్యామలం చేసేందుకు జలయజ్ఞం ద్వారా రూ.220 కోట్లతో అభివృద్ధికి శ్రీకారం చుట్టారు. సోమశిల ప్రాజెక్ట్ ద్వారా 5,84,500 ఎకరాలు సాగులోకి తెచ్చేందుకు ప్రతిపాదన చేశారు. ఇందులో 4,05,500 ఎకరాలు మాగాణి భూములతో పాటు కొత్తగా 1,79,000 ఎకరాల ఆయకట్టును స్థిరీకరించారు. దీంతో ఇప్పటికి దాదాపు 5,34,583 ఎకరాలకు పారుదల జరుగుతోంది. 49,917 ఎకరాలు ఆయకట్టు పారుదల జరగాల్సి ఉంది. శ్రీశైలం జలాశయం నుంచి కృష్ణానది జలాలు సోమశిల రిజర్వాయర్ నుంచి కండలేరు జలాశయానికి, చెన్నై తాగునీటి అవసరాలకు 15 టీఎంసీలు పంపాల్సి ఉంది.



మహానేత దూరదృష్టి.. అభివృద్ధి సృష్టి

దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ దూరదృష్టితో అభివృద్ధి సృష్టించారు. ఉమ్మడి నెల్లూరు జిల్లాలో 169 కి.మీ. పొడవైన సముద్ర తీరంలో మధ్య భాగం కృష్ణపట్నంలో పోర్టును నిర్మించారు. ఈ పోర్టు ద్వారా ఎగుమతులు, దిగుమతులతో ప్రపంచ స్థాయిలో సింహపురి కీర్తిని నిలిపారు. ఈ పోర్టు ద్వారా జిల్లాలో వేలాది మందికి ఉద్యోగ, ఉపాధి కల్పనకు బీజాలు వేశారు. జిల్లాకే కాకుండా రాష్ట్ర, కేంద్ర ఖజానాలకు ఆదాయవనరుగా మార్చారు. మరో వైపు అదే ప్రాంతంలో ప్రభుత్వ రంగంలో 2,400 మెగా వాట్ల విద్యుత్ ఉత్పత్తికి శ్రీకారం చుట్టి.. జిల్లాలో వెలుగులు నింపారు.

సంగం బ్యారేజ్ నిర్మాణంతో..


జిల్లాలోనే కీలక ప్రాజెక్టులైన సంగం, పెన్నా బ్యారేజీలపై దృష్టి సారించి 2006 మే 28న రూ.98 కోట్ల వ్యయంతో సంగం బ్యారేజీ శంకుస్థాపన చేశారు. 800 మీటర్ల పొడవుతో దీన్ని నిర్మించి 0.45 టీఎంసీల నీటిని నిల్వ చేయడంతో పాటు డెల్టా స్థిరీకరణకు దోహదపడేలా సిద్ధం చేశారు. అయితే నిర్మాణ వ్యయం పెరగడంతో 2008లో రీ టెండర్లు నిర్వహించి ప్రాజెక్ట్ వ్యయాన్ని రూ.149.60 కోట్లకు పెంచి పనులు వేగవంతం చేశారు. ఆయన మరణానికి ముందు వరకు 40 శాతం పనులు పూర్తయ్యాయి. తదనంతర పాలకులు దీనిపై నిర్లక్ష్యం వహించడంతో పనులు ఎక్కడి గొంగడి అక్కడే అన్నట్లుగా మారాయి. ఈ క్రమంలో వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రాగానే ఆయన కుమారుడు, అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దీనిపై దృష్టి సారించి పనులు వేగవంతం చేయించి ప్రజలకు అంకితం చేశారు. దీంతో జిల్లాలోని 3.85 లక్షల ఎకరాల ఆయకట్టు స్థిరీకరణకు దోహదపడింది. పెన్నాడెల్టాలో 2.47 లక్షల ఎకరాలకు, కనుపూరు కెనాల్ పరిధిలో 63 వేల ఎకరాలు, కావలి కెనాల్ 75 వేల ఎకరాలకు సాగునీరు అందడంతో పాటు రానున్న రోజుల్లో కొత్త ఆయకట్టు సాగులోకి రావడానికి దోహదపడింది. ఆత్మకూరు, ఉదయగిరి, కావలి, సర్వేపల్లి, నెల్లూరు సిటీ, నెల్లూరు రూరల్, కోవూరు, వెంకటగిరి నియోజకవర్గాల్లో సాగుకు మేలు చేకూరుతోంది. సోమశిల నుంచి 40 కిలో మీటర్ల దిగువ భాగంలో దీన్ని నిర్మించడం ద్వారా కుడి వైపున నెల్లూరు చెరువు, నెల్లూరు కాలువ, కనుపూరు కాలువ, కనిగిరి ప్రధాన కాలువ, దువ్వూరు కాలువ, కావలి కాలువ పరిధిలోని 3.85 లక్షల ఎకరాల సాగుకు ఇబ్బంది లేకుండా నీటి విడుదల జరుగుతోంది.



➡ సూళ్లూరుపేట నియోజకవర్గంలో సెజ్‌లు ఏర్పాటు చేసి పారిశ్రామికాభివృద్ధితో ఆ ప్రాంతం ముఖచిత్రాన్ని మార్చేశారు. మూడు సెజ్‌ల్లో పారిశ్రామికంగా అభివృద్ధి వైపు పరుగులు తీయించి ప్రజల జీవన స్థితిగతుల్లో పెనుమార్పులు తీసుకువచ్చారు. గతంలో ఈ ప్రాంతం ఎంతో వెనుకబడి ఉండేది. వైఎస్సార్ ముఖ్యమంత్రి అయ్యాక రాజీవ్ పల్లెబాట కార్యక్రమాన్ని తడ నుంచి ప్రారంభించారు. ఆ సమయంలో నిరుద్యోగ యువతను చూసిన ఆయన ఉద్యోగాలు కల్పించాలని నిర్ణయించుకున్నారు. ఈ క్రమంలో తడ మండలం మాంబట్టు, నెల్లూరు – చిత్తూరు జిల్లాల సరిహద్దులో సత్యవేడు, వరదయ్యపాళెం, తడ మండలాలను కలుపుకుని సుమారు ఆరు వేల ఎకరాల్లో శ్రీసిటీ సెజ్ ఏర్పాటయ్యాయి. నాయుడుపేటలోని మేనకూరును కలిపి మూడు సెజ్‌ల్లో సుమారు 220 కంపెనీలు ఏర్పాటు చేశారు. ఎంతో మంది నిరుద్యోగులకు ప్రత్యక్షంగా పరోక్షంగా ఉపాధి కల్పించిన ఘనతను వైఎస్సార్ దక్కించుకున్నారు.

➡ 2008 మే నెలలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి మేనకూరు సెజ్‌లో భూమి పూజ చేసి పరిశ్రమలకు శ్రీకారం చుట్టారు. ఇక్కడ చిన్న, మధ్య తరహా భారీ పరిశ్రమలతో కలిపి 25కు పైగా ఉన్నాయి. పోర్టులు, విమానాశ్రయాలు దగ్గర్లో ఉండడం, జలవనరులు పుష్కలంగా ఉండడంతో ఈ సెజ్ పారిశ్రామికంగా మరింత అభివృద్ధి చెందుతోంది. హిందూస్థాన్ నేషనల్ గ్లాస్, గ్రీన్‌టెక్, లాయల్ టెక్స్‌టైల్స్, ప్రైమ్ మేడిన్, హీమెయిర్, అరబిందో ఫార్మా తదితర భారీ పరిశ్రమలున్నాయి.

సమగ్ర సోమశిల సాకారం



వైఎస్ రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక జిల్లా రైతుల సమగ్ర సోమశిల కలను ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారు. ఏటా 35 నుంచి 48 టీఎంసీలకే పరిమితమైన సోమశిలను జలయజ్ఞం ద్వారా అభివృద్ధికి శ్రీకారం చుట్టారు. ముంపు పరిహారంలో నెలకొన్న జాప్యం, అటవీశాఖ అనుమతులు లభించని పరిస్థితిపై దృష్టి సారించారు. ముంపు ప్రాంత బాధితుల పరిహారాన్ని వెంటనే విడుదల చేయించారు. వైఎస్సార్ పాలన ఏడాదిలోపే 48 టీఎంసీల నీటి నిల్వను 51 టీఎంసీల వరకు నీటి నిల్వ సామర్థ్యం పెంచారు. 2007–08లో 317 కాంటూరు వరకు నింపి పూర్తిస్థాయిలో 51 టీఎంసీ నిల్వ ఉంచేలా చేశారు. అనంతరం 326 కాంటూరు వరకు నీటి నిల్వ సామర్థ్యాన్ని పెంచేందుకు వైఎస్సార్ జిల్లా ఎగువరాచపల్లి అడ్డంకిగా ఉండేది. ఈ గ్రామానికి యుద్ధప్రాతిపదికన పరిహారం చెల్లించి ఖాళీ చేయించి నీటి సామర్థ్యం పెంచేలా చేశారు. జలాశయంలో నీటి సామర్థ్యాన్ని 72 టీఎంసీల వరకు పెంచేలా చేసి సింహపురి రైతుల్లో హృదయాల్లో చెరగని ముద్రవేసుకున్నారు. ప్రధానంగా సమగ్ర సోమశిలలో భాగంగా 104 కిలో మీటర్ల పొడవునా ఉత్తర కాలువను సోమశిల నుంచి ప్రకాశం జిల్లా కందుకూరు వరకు అభివృద్ధి చేసి నీటి అవుట్ ఫ్లో సామర్థ్యాన్ని పెంచారు.



పెన్నా బ్యారేజ్‌తో..

2008లో పెన్నాబ్యారేజ్‌ను రూ.126 కోట్ల వ్యయంతో నిర్మించడానికి శంకుస్థాపన చేశారు. 0.55 టీఎంసీ నీటి సామర్థ్యంతో తలపెట్టిన పెన్నా బ్యారేజీ తదనంతరం రీ టెండర్ల ద్వారా రూ.149.39 కోట్లకు చేరింది. దివంగత మహానేత హయాంలో పరుగులు తీసిన అభివృద్ధి మళ్లీ ఆయన తనయుడు దృష్టి సారించి పూర్తి చేశారు. 57 గేట్లతో 637 మీటర్ల పొడవుతో 10.90 లక్షల క్యూసెక్కుల వరద నీటి ప్రవాహానికి అనుగుణంగా బ్యారేజ్‌ని నిర్మించారు. నెల్లూరు బ్యారేజ్ నిర్మాణంతో 5 మండలాల్లోని 72 గ్రామాల పరిధిలో 99,525 ఎకరాల ఆయకట్టు స్థిరీకరణ జరిగింది. సర్వేపల్లి కాలువ, జాఫర్ సాహెబ్ కాలువల పరిధిలోని ఈ ఆయకట్టు పూర్తిగా నీరు అందుతోంది. నెల్లూరు నగర తాగునీటి అవసరాలు తీరుతాయి. నెల్లూరు–కోవూరు మధ్య దూరం తగ్గింది.

కావ్య అక్రమాల నిగ్గు తేల్చుతాం

- మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డిపై అక్రమ కేసు దుర్మార్గం
- ఎమ్మెల్యే క్వారీలో అవినీతిపై విచారణ జరపాలి
- రూ.900 కోట్ల మనీస్కాం సూత్రధారులను కాపాడుతున్న ఎమ్మెల్యే
- వైఎస్సార్‌సీపీ నేతలతో కలిసి కలెక్టర్‌కు కాకాణి వినతిపత్రం



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న కాకాణి, పర్వతరెడ్డి, వైఎస్సార్‌సీపీ నేతలు

నెల్లూరు (అర్బన్): కావలి ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి అవినీతి, అక్రమాలను నిగ్గు తేల్చుతామని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి స్పష్టం చేశారు. కావ్య అవినీతిని ప్రశ్నించినందుకే కక్షగట్టి పోలీసుల ద్వారా మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డిపై అక్రమ కేసులు బనాయించడం దుర్మార్గమన్నారు. జలదంకి మండలం అన్నవరం క్వారీలో జరుగుతున్న అక్రమాలు, రూ.900 కోట్ల మనీస్కాం వెనుక ఉన్న అధికారపార్టీ ప్రజాప్రతినిధుల హస్తంపై విచారణ జరిపించాలని కోరుతూ ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య, నెల్లూరు రూరల్ ఇన్‌చార్జి ఆనం విజయకుమార్‌రెడ్డి, పలువురు పార్టీ నేతలతో కలిసి కాకాణి కలెక్టర్ ఆనంద్‌కు కలెక్టరేట్‌లో సోమవారం వినతిపత్రం అందజేశారు. కాకాణి మీడియాతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో టీడీపీ ఎమ్మెల్యేలు అవినీతికి పాల్పడుతున్నారని విమర్శించారు. కావలి ఎమ్మెల్యే అన్నవరం క్వారీలో పరిమితికి మించి చేపడుతున్న అక్రమ తవ్వకాలను వెలుగులోకి తెచ్చేందుకు 10 ఏళ్లు ఎమ్మెల్యేగా పనిచేసిన ప్రతాప్‌కుమార్‌రెడ్డి డ్రోన్‌తో ఫొటోలు తీయించారన్నారు. ఎమ్మెల్యే లేని ప్రాంతంలో ఎమ్మెల్యేని చంపడానికి డ్రోన్ ఎగురవేశారంటూ హత్యాయత్నం కేసు నమోదు చేయడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఎక్కడ బెయిల్ వస్తుందోననే ఉద్దేశంతో ఎస్సీ, ఎస్టీ కేసు కూడా పెట్టడం సిగ్గు చేటన్నారు. తాము రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డిని పరామర్శించడానికి వెళ్తుంటే తొడగొట్టి మీసం మెలేసిన ఎమ్మెల్యే వెంటనే పోలీసులను పురమాయించి తమను, తమ పార్టీ నేతలను హౌస్ అరెస్ట్ చేయడం చేతగాని తనమన్నారు. కావలి ప్రాంతంలో రూ.900 కోట్ల మనీ స్కాంలో సూత్రధారులను వదిలేసి అనామకులైన ఒకరిద్దరిపై కేసులు దులుపు కోవడం దారుణమన్నారు. ఈ మనీస్కాంను కావలి ఎమ్మెల్యే ఎందుకు తొక్కిపెడుతున్నాడో సమాధానం చెప్పాలని కాకాణి డిమాండ్ చేశారు. పేదల సొమ్ముకు ఆశ పడి మనీస్కాంకు పాల్పడిన కావలి ఎమ్మెల్యే శాసనసభకు అర్హుడా అని ప్రశ్నించారు. ఎన్ని కారుకూతలు కూసినా కావ్య అవినీతిని బట్టబయలు చేసి తీరుతామన్నారు. ఎస్పీకి వినతిపత్రం ఇచ్చినా స్పందించడం లేదన్నారు. కలెక్టర్ జోక్యం చేసుకుని కావలి ఎమ్మెల్యే నిర్వహిస్తున్న క్వారీ అక్రమాలు, మనీ స్కాం సూత్రధారులపై విచారణ చేపట్టి తగు చర్యలు తీసుకోవాలన్నారు. కలెక్టర్ స్పందించకపోతే చలో అన్నవరం కార్యక్రమం నిర్వహించి తీరుతామన్నారు.

స్థాయి మరిచి.. బజారు భాష ఏంటి?

ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ కావలి ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి తన స్థాయిని మరిచి బజారు మనిషిగా మాట్లాడుతున్న మాటలను చూసి ప్రజలే అసహ్యించుకుంటున్నారన్నారు. తమ పార్టీ నాయకులను కావలికి రమ్మని పిలిచి పోలీసులతో హౌస్ అరెస్టు చేయించిన పిరికోడని దుయ్యబట్టారు. పోలీసులు ఎవరి మాటలు విని తమ ఇళ్లను చుట్టుముట్టారో తెలపాలన్నారు.

ఎమ్మెల్యే నిజాయితీ నిరూపించుకోవాలి

సూళ్లూరుపేట మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య మాట్లాడుతూ ప్రతి పక్షంలో ఉన్న రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి ప్రజలకు అండగా ఉన్నాడన్నారు. ప్రజలకు జరిగే ఇబ్బందులను ప్రశ్నించాడన్నారు. ఎమ్మెల్యే కృష్ణారెడ్డికి చిత్తశుద్ధి ఉంటే ప్రతాప్‌కుమార్‌రెడ్డి చేసిన విమర్శలను స్వీకరించి స్వచ్ఛందంగా ఎమ్మెల్యే నిర్వహిస్తున్న క్వారీపై అధికారులతోనే విచారణ జరిపించుకోవాలన్నారు. కావలికి ప్రతిపక్ష నాయకులు వస్తే ఒప్పుకునేది లేదంటే.. అదేమైనా జీ జగీరా అని ప్రశ్నించారు.

ప్రశ్నిస్తేనే 307 సెక్షన్ నమోదు చేస్తారా?

నెల్లూరు రూరల్ ఇన్‌చార్జి ఆనం విజయకుమార్‌రెడ్డి మాట్లాడుతూ కేవలం ప్రశ్నిస్తేనే 307 సెక్షన్ కింద హత్యాయత్నం కేసులు నమోదు చేస్తారా? అని నిలదీశారు. జగన్మోహన్‌రెడ్డి పర్యటనలో ప్రసన్నకుమార్‌రెడ్డి ఇంటి వద్ద మఫ్టీలో ఉన్న ఓ పోలీసు తట్టుకుని కింద పడితే ప్రసన్నకుమార్‌రెడ్డిపై హత్యాయత్నం కేసు పెట్టారన్నారు. నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో రౌడీలను పెంచి పోషిస్తున్నదే అధికారపార్టీ ఎమ్మెల్యేనన్నారు.

లాభాలు వస్తాయని.. నమ్మించి మోసం

- ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 79 ఫిర్యాదులు
- సైబర్ నేరగాళ్లతో జాగ్రత్త : ఏఎస్పీ


బాధితుల సమస్యలు వింటున్న ఏఎస్పీ సౌజన్య

నెల్లూరు(క్రైమ్): లాభాలు వస్తాయని నమ్మించి.. పెట్టుబడి పెట్టించి మోసం చేశారని పలువురు బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. నెల్లూరులోని ఉమేష్ చంద్ర కాన్ఫరెన్స్ హాల్లో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం జరిగింది. 79 ఫిర్యాదులు వచ్చాయి. ఈ సందర్భంగా ఏఎస్పీ సీహెచ్ సౌజన్య మాట్లాడుతూ ఇంటర్నెట్ వేదికగా సైబర్ నేరగాళ్లు మోసగిస్తున్నారని, అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రతి ఫిర్యాదును క్షుణ్ణంగా పరిశీలించిన ఏఎస్పీ ఆయా ప్రాంత పోలీస్ అధికారులతో మాట్లాడారు. చట్టపరిధిలో సమస్యలను పరిష్కరించి బాధితులకు సత్వర న్యాయం జరిగేలా చూడాలని ఆదేశించారు. కార్యక్రమంలో మహిళా పోలీస్‌స్టేషన్ డీఎస్పీ కేసీహెచ్ రామారావు, లీగల్ అడ్వైజర్ టి.శ్రీనివాసులురెడ్డి, ఎస్బీ - 2 ఇన్‌స్పెక్టర్ బి.శ్రీనివాసరెడ్డి, ఫిర్యాదుల సెల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఫిర్యాదుల్లో కొన్ని...

- మ్యాట్రిమోనియల్ వెబ్‌సైట్‌లో కీర్తి అనే మహిళ పరిచయమైంది. క్రిప్టో కరెన్సీలో ట్రేడింగ్ చేస్తే అధిక లాభాలు వస్తాయని ఆశ చూపించి రూ.14.50 లక్షలు పెట్టుబడి పెట్టించింది. ఆదాయం రాకపోవడంతో విచారించగా నకిలీ పోర్టల్ అని తేలింది. ఆమెకు ఫోన్ చేయగా స్విచ్ఛాఫ్‌లో ఉంది. విచారించి న్యాయం చేయాలని కలిగిరికి చెందిన ఓ వ్యక్తి కోరాడు.
- ఇన్‌స్టాగ్రామ్‌లో ఓ మహిళ పరిచయమైంది. షేర్ మార్కెట్‌లో పెట్టుబడి పెడితే అధిక లాభాలు వస్తాయని నమ్మించింది. ఆమె మాటలు నమ్మి రూ.50 లక్షలు వరకు పెట్టి మోసపోయానని కావలి రెండో పట్టణ ప్రాంతానికి చెందిన వ్యక్తి ఫిర్యాదు చేశాడు.
- నా తమ్ముడిని టిప్పర్ ఢీకొనడంతో తీవ్రగాయాలై మృతిచెందాడు. ప్రమాదానికి కారణమైన వారిపై తగిన చర్యలు తీసుకోవాలని అల్లూరుకు చెందిన ఓ వ్యక్తి అర్జీ ఇచ్చాడు.
- పెద్ద కుమార్తె ప్రమీల, ఆమె భర్త జీవనోపాధి కోసం నా వద్ద రూ.3 లక్షలు అప్పుగా తీసుకున్నారు. నగదు తిరిగివ్వకుండా ఇబ్బందులు పెడుతున్నారని వెంకటాచలం ప్రాంతానికి చెందిన ఓ వృద్ధుడు వినతిపత్రం ఇచ్చాడు.
- నా కుమార్తె నెలరోజులుగా కనిపించడం లేదు. ఆచూకీ కనుక్కుని అప్పగించాలని దర్గామిట్ట ప్రాంతానికి చెందిన ఓ మహిళ కోరారు.
- నా భర్త వేధింపులు తట్టుకోలేక బుచ్చిరెడ్డిపాళెం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశా. పోలీసులు కేసు నమోదు చేశారు. ఇప్పుడు కేసును విత్‌డ్రా చేసుకోవాలని లేకుంటే అంతు చూస్తానని భర్త బెదిరిస్తున్నాడు. విచారించి చర్యలు తీసుకోవాలని ఓ మహిళ ఫిర్యాదు చేశారు.

నిమ్మ ధరలు (కిలో)

పెద్దవి : రూ.40
సన్నవి : రూ.25
పండ్లు : రూ.10

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్:	రూ.120
లేయర్	రూ.123
బ్రాయిలర్ చికెన్:	రూ.220
స్కిన్‌లెస్ చికెన్:	రూ.242
లేయర్ చికెన్:	రూ.210



అంత గోప్యత ఎందుకో..?

- స్పోర్ట్స్ ఎక్స్‌లెన్సీ అవార్డులకు స్కూళ్ల ఎంపిక
- మొక్కుబడిగా కార్యక్రమం
- విద్యాశాఖ తీరుపై విమర్శల వెల్లువ

నెల్లూరు(టౌన్): స్పోర్ట్స్ ఎక్స్‌లెన్సీ అవార్డుల విషయంలో విద్యాశాఖ అధికారులు వ్యవహరించిన తీరుపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అవార్డుల కింద నెల్లూరు అర్బన్‌లోని బీవీఎస్ఎంసీ (బాలికలు) హైస్కూల్ (ప్రథమ స్థానం), కోవూరు మండలం పాటూరు జెడ్పీపీహెచ్ఎస్ (ద్వితీయ స్థానం), వెంకటాచలంలోని ప్రభుత్వ టీడబ్ల్యూ ఆశ్రమ హైస్కూల్ (తృతీయ స్థానం), సంగంలోని డా.బీఆర్ అంబేడ్కర్ గురుకులం (నాలుగో స్థానం), ముత్తుకూరులోని డా.బీఆర్ అంబేడ్కర్ గురుకులం (ఐదో స్థానం)ను ఎంపిక చేశారు. గత నెల 29వ తేదీన ధ్యాన్‌చంద్ జయంతి సందర్భంగా వాటి హెచ్ఎంలు, వ్యాయామ ఉపాధ్యాయులను సత్కరించి అవార్డులను అందజేశారు. అయితే ఈ తంతు జిల్లా విద్యాశాఖ కార్యాలయంలోనే మొక్కుబడిగా నిర్వహించినట్లు తెలిసింది. అవార్డు కోసం జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలు దరఖాస్తులు చేసుకోవాలన్న ప్రకటనను పత్రికలకు ఇవ్వలేదు. సాధారణంగా ప్రతి అంశం గురించి ఇచ్చే విద్యాశాఖ అధికారులు దీనిని మాత్రం గోప్యంగా ఉంచడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అవార్డుకు ఎంపికైన పాఠశాలల వివరాలను గోప్యంగా ఉంచడం ఆ శాఖలో చర్చకు దారితీసింది.

పాఠశాల వ్యాన్ ఢీకొట్టడంతో..

- భర్త మృతి, భార్యకు గాయాలు


ఘటనా స్థలంలో మృతదేహం

ఆత్మకూరు: పాఠశాల వ్యాన్ మోటార్‌బైక్‌ను ఢీకొట్టడంతో షేక్ ఖాసీం (35) అనే వ్యక్తి అక్కడికక్కడే మృతిచెందిన ఘటన మండలంలోని కరటంపాడు గ్రామం వద్ద నెల్లూరు – ముంబై రహదారిపై సోమవారం సాయంత్రం జరిగింది. ఎస్సై ఎస్కే జిలానీ కథనం మేరకు.. ఉదయగిరి మండలానికి చెందిన షేక్ ఖాసీం తన భార్య హజరత్‌బీతో కలిసి ఉదయగిరి నుంచి నెల్లూరుకు బైక్‌పై వెళ్తున్నాడు. అదే సమయంలో ఆత్మకూరు పట్టణంలోని ఓ ప్రైవేట్ పాఠశాల వ్యాన్ కరటంపాడు గ్రామంలోకి మలుపు తిరుగుతూ బైక్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో తలకు తీవ్ర గాయమై ఖాసీం మృతిచెందాడు. హజరత్‌బీకి గాయాలయ్యాయి. పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆత్మకూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

వైభవంగా చిరాగా ఉత్సవం


దీపాలు వెలిగిస్తున్న భక్తులు

ఆత్మకూరు: ఏఎస్‌పేట మండల కేంద్రంలోని హజరత్ ఖాజా నాయబ్ రసూల్ దర్గాలో సోమవారం చిరాగా (దీపాలంకరణ) ఉత్సవం ఘనంగా జరిగింది. ముందురోజు రాత్రి దొరసానమ్మ గంధ మహోత్సవం నిర్వహించిన అనంతరం మరుసటిరోజు చిరాగా ఉత్సవం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. అందులో భాగంగా మహిళలు దర్గా ఆవరణలోని కోనేరు వద్ద దీపాలను వెలిగించారు.

మెదడువాపు లక్షణాలతో బాలిక మృత్యువాత?

- వైద్య సిబ్బంది పొంతనలేని సమాధానాలు

గుడ్లూరు(కందుకూరు రూరల్): మెదడువాపు వ్యాధి లక్షణాలతో ఓ బాలిక మృతిచెందిన ఘటన మండలంలోని మొగళ్లూరులో జరిగింది. గ్రామస్తులు, బాధితుల కథనం మేరకు.. మొగళ్లూరు గ్రామానికి చెందిన ప్రిన్సి (13)కి వారం రోజుల క్రితం తీవ్ర జ్వరం, తలనొప్పి రావడంతో కందుకూరులోని ఓ ప్రైవేట్ వైద్యశాలలో చికిత్స చేయించారు. మూడు రోజులు చికిత్స అందించినా ఆరోగ్యం కుదుట పడకపోవడంతో మెరుగైన వైద్యం నిమిత్తం ఒంగోలులోని ఓ ప్రైవేట్ వైద్యశాలకు తరలించారు. అక్కడ రెండు రోజులు చికిత్స పొందిన బాలిక ఆదివారం చనిపోయింది. బాధిత తల్లిదండ్రులు మాత్రం జ్వరం, తలనొప్పి వచ్చిందని మెదడుకు సంబంధించిన వ్యాధితో మృతిచెందినట్లు వైద్యులు తెలిపారని చెబుతున్నారు. దీంతో గ్రామస్తులు భయాందోళన చెందుతున్నారు.

గుండె సమస్యతో..

అయితే గుడ్లూరు పీహెచ్‌సీ వైద్యాధికారి సాయి ప్రియాంకను వివరణ కోరగా బాలిక మానసిక పరిస్థితి బాగుండదన్నారు. గుండె సమస్యతో మృతిచెందినట్లు చెబుతున్నారు. గ్రామస్తులు చెబుతున్న దానికి వైద్యాధికారులు చెబుతున్న దానికి పొంతనలేకపోవడంతో స్థానికుల్లో ఆందోళన నెలకొంది. అయితే మొగళ్లూరుతోపాటు చుట్టుపక్కల గ్రామాలు, గుడ్లూరులో మెదడువాపుతో మృతిచెందినట్లు ప్రచారం జరుగుతోంది.

ఆదుకోండి సారూ..

- కలెక్టరేట్‌లో 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక'
- 436 వినతుల అందజేత
- సాయం కోసం పలువురి వినతి


అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ ఆనంద్, జేసీ కార్తీక్ తదితరులు

నెల్లూరు రూరల్: అయ్యా.. నా బిడ్డకు పింఛన్ పెంచి ఆదుకోండని ఒకరు.. ఆపరేషన్ చేయించేందుకు డబ్బుల్లేవని, సాయం చేయాలని మరొకరు.. ఇలా ఎంతోమంది వివిధ సమస్యలపై వినతులందించారు. నెల్లూరు కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం జరిగింది. కలెక్టర్ ఆనంద్, జేసీ కార్తీక్, ఇన్‌చార్జి డీఆర్వో విజయ్‌కుమార్, జెడ్పీ సీఈఓ మోహన్‌రావు, జిల్లా పంచాయతీ అధికారి శ్రీధర్ రెడ్డి అర్జీలను స్వీకరించారు. రెవెన్యూ శాఖకు సంబంధించి 174, మున్సిపల్ శాఖవి 41, సర్వేవి 18, పంచాయతీరాజ్ శాఖవి 38, పోలీసు శాఖవి 62, సివిల్ సప్లయ్స్‌వి 11 తదితరాలు కలిపి 436 అర్జీలను ప్రజలు అందజేశారు.

దొంగ పట్టాలు సృష్టించి ప్లాట్లు వేశారు

టీడీపీ కార్పొరేటర్ భర్త అరవ శ్రీనివాసులు దొంగ పట్టాలు సృష్టించి ప్లాట్లు వేసి అమ్ముతున్నారని 24 డివిజన్ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి ఉడతా మురళి యాదవ్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఆయన మాట్లాడుతూ కలూరుపల్లి గ్రామంలో 75 ప్లాట్లు వేసి ఒక్కొక్కటి రూ.2 లక్షల నుంచి రూ.4 లక్షల వరకు విక్రయిస్తున్నట్లు ఆరోపించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే సదరు భూమిలో ఉంచిన బోర్డులను తీసేశారన్నారు. దీనిపై అధికారులకు పలుమార్లు అర్జీలిచ్చినట్లు చెప్పారు. ఇంత వరకు స్పందన లేదన్నారు. తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

న్యాయం చేయాలని విన్నవించి..

కొందరు వ్యక్తులు తప్పుడు కుల ధ్రువీకరణపత్రం పెట్టి తనకు రావాల్సిన వ్యాయామ ఉపాధ్యాయుడి పోస్టు తీసుకున్నారని సంగం మండలం గాంధీ జన సంగం గ్రామస్తుడు మేంద్రగుత్తి మధుబాబు వినతి పత్రమిచ్చాడు. తనకు డీఎస్సీలో 235 ర్యాంక్ వచ్చిందన్నారు. తప్పుడు పత్రాలతో కొందరు ధ్రువపత్రాలు సృష్టించి ఉద్యోగాలకు అర్హత పొందారన్నారు. న్యాయం చేయాలని కోరాడు.

పింఛన్ పెంచాలంటూ..



ఈమె పేరు షేక్ షకియా. పుట్టినప్పటి నుంచి సెరిబ్రల్ పాల్సీతో బాధపడుతూ మంచానికే పరిమితమైంది. పెన్షన్ వస్తోంది. రూ.15,000 పెన్షన్ కోసం పలుమార్లు వినతిపత్రాలు సమర్పించారు. బయోమెట్రిక్ పనిచేయకపోవడంతో ప్రస్తుతం రూ.6,000 అందుతోంది. ఇటీవల ఆమె తండ్రి మరణించాడు. నెల్లూరు రామకోటి నగర్‌లో ఉంటున్న తల్లి ఆయేషా మళ్లీ కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. భర్త ఉన్నప్పుడు ఎలాగోలా నెట్టుకొచ్చామని, ఇప్పుడు ఏం చేయాలో అర్థం కావడం లేదని వాపోయారు. ఆధార్ అప్‌డేట్ సమస్య ఇంకా పరిష్కారం కాలేదని, అధికారులు స్పందించాలని కోరింది.

సహాయం చేయండి


బిడ్డతో వెంకటరమణమ్మ

నా బిడ్డ తలలో నీరు గడ్డలున్నాయని, ప్రాణం కాపాడాలని ఆత్మకూరు మండలం వెంకట్రావుపల్లికి చెందిన ఆదిపూడి వెంకటరమణమ్మ వినతిపత్రం సమర్పించారు. ఆమె వివరాలు వెల్లడించారు. రుయా హాస్పిటల్‌కు పాపను రెండు సార్లు తీసుకెళ్లగా డాక్టర్లు పరీక్షలు చేసి నీరుగడ్డలు ఎక్కువ ఉన్నట్లు చెప్పారు. చిన్నపిల్లలకు ఆపరేషన్ ఇప్పుడు చేయట్లేదని, నెల్లూరులోనే నారాయణ హాస్పిటల్‌కు తీసుకెళ్లాలన్నారు. అక్కడికెళ్తే డాక్టర్లు రూ.75,000 ఖర్చవుతుందన్నారు. తమది నిరుపేద కుటుంబమని, అంత డబ్బు కట్టలేమని, పాపను రక్షించాలని ఆమె కోరుతోంది.

పాపం దివ్యాంగులు

- గుంటూరు వాసిని పొదలకూరు సీహెచ్‌సీకి రిఫరల్
- చుక్కలు చూపిస్తున్న కూటమి ప్రభుత్వం



ఈ చిత్రంలోని దివ్యాంగుడి పేరు రామదాసు. ఈయన గుంటూరు జిల్లా ప్రత్తిపాడు మండలం గనికపూడి వాసి. రూ.15 వేలు పింఛన్ వస్తోంది. కూటమి ప్రభుత్వం నోటీసు ఇచ్చి రీ వెరిఫికేషన్ చేయించుకోవాలని చెప్పింది. ఆన్‌లైన్‌లో సదరం రీ వెరిఫికేషన్‌కు స్లాట్ బుక్ చేసుకుంటే సోమవారం పొదలకూరులోని సీహెచ్‌సీకు వెళ్లి క్యాంప్‌లో పరీక్షలు నిర్వహించుకోవాలని చెప్పారు. ఆయన తన కుమార్తె, భార్య సహకారంతో ఆదివారం రాత్రి పొదలకూరుకు చేరుకుని బస్టాండ్‌లో నిద్రించి సోమవారం ఉదయం ఆస్పత్రికి వచ్చాడు.


పరీక్షల కోసం దూరప్రాంతాల నుంచి వచ్చి ఎదురుచూస్తూ..


తెరుచుకోని పరీక్షల కోసం కేటాయించిన గది

పొదలకూరు: సదరం సర్టిఫికెట్ల రీ వెరిఫికేషన్ పేరుతో జనవరి, ఫిబ్రవరి, మార్చి మూడు నెలలు సర్వేపల్లి నియోజకవర్గానికి పొదలకూరు సీహెచ్‌సీలో క్యాంపును ఏర్పాటు చేశారు. ఇందులో 2,133 మంది దివ్యాంగులు పాత సర్టిఫికెట్లను చూపి తిరిగి పరీక్షలను చేయించుకున్నారు. సర్టిఫికెట్లను పొందారు. అయితే కొందరు తమకు వికలత్వం తక్కువగా ఉందని సర్టిఫికెట్లు ఇవ్వడంతో పింఛన్లను కోల్పోవాల్సి వచ్చిందని వాపోతున్నారు. కాగా పరీక్షల కోసం సోమవారం సీహెచ్‌సీకి వచ్చిన దివ్యాంగులు పడిగాపులు కాయాల్సి వచ్చింది. ఉదయం 10 గంటలకు హాజరు కావాల్సిన వైద్యనిపుణులు 11:30 గంటలకు కూడా రాకపోవడంతో దివ్యాంగులు ఇబ్బందులు పడ్డారు. బయటి ప్రాంతాల నుంచి వచ్చిన వారు గంటల సమయం వేచి ఉండాల్సి వచ్చింది. గుంటూరు, ప్రకాశం జిల్లాల నుంచి కూడా దివ్యాంగులు ఇక్కడికి వచ్చారు.

పాత పద్ధతిలోనే ఎఫ్‌సీలివ్వాలని డిమాండ్



మాట్లాడుతున్న యూనియన్ నాయకులు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): వాహనాలకు ఫిట్‌నెస్ సర్టిఫికెట్లను పాత పద్ధతిలోనే ఇవ్వాలని ఆలిండియా రోడ్డు ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ నాయకులు డిమాండ్ చేశారు. నెల్లూరులోని సీఐటీయూ కార్యాలయంలో ఆటో, మినీలారీ, అంబులెన్స్, ట్రక్ అండ్ గూడ్స్ యూనియన్ నాయకులు సోమవారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆ ఫెడరేషన్ జిల్లా బాధ్యుడు సురేష్ మాట్లాడుతూ సెన్సార్ పద్ధతి ద్వారా ఎఫ్‌సీ ఇచ్చే విధానం వల్ల వాహన యజమానులపై ఆర్థిక భారం పడుతుందన్నారు. ఉదయగిరి, సీతారామపురం, కందుకూరు, రాపూరు తదితర మండలాలకు చెందిన వాహనదారులు సర్టిఫికెట్ల కోసం 100 కిలోమీటర్ల దూరంలో ముత్తుకూరు మండలం కప్పలదొరువు వద్ద ఏర్పాటు చేసిన సెన్సార్ ట్రాక్ వద్దకు రావాల్సి ఉంటుందన్నారు. ప్రైవేట్ సంస్థలకు ఆదాయాన్ని తీసుకొచ్చేలా ఈ పద్ధతిని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకొచ్చాయని ఆరోపించారు. సమావేశంలో పలు యూనియన్ల నాయకులు రాజా, మాలకొండయ్య, వెంకటేశ్వర్లు, శివకుమార్, విజయ్, జిలానీ, సుధాకర్, రవీంద్ర, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వ దుర్మార్గ నిర్ణయం

- ప్రాణాలు కోల్పోయిన పారిశుద్ధ్య కార్మికుడు
- నివాళులర్పించిన సీఐటీయూ నాయకులు


నివాళులర్పిస్తున్న శ్రీనివాసులు తదితరులు

నెల్లూరు(బారకాసు): కూటమి ప్రభుత్వ నిర్ణయంతో మున్సిపల్ శాఖ మంత్రి పొంగూరు నారాయణ ఇలాకాలో నగరపాలక సంస్థ పారిశుద్ధ్య కార్మికుడు ప్రాణాలు కోల్పోయిన ఘటన నెల్లూరు నగరంలో సోమవారం చోటుచేసుకుంది. ఎన్ఎంసీ పరిధిలోని 45వ డివిజన్ కార్మికుడు జోసఫ్ వయసు 60 ఏళ్లు నిండిందని నిలిపేశారు. దీంతో అతను మానసిక్షోభకు గురై గుండెపోటుతో మరణించాడని ఏపీ మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయూ) నాయకులు ఆరోపించారు. ఆ యూనియన్ నగర గౌరవాధ్యక్షుడు కత్తి శ్రీనివాసులుతోపాటు పలువురు నేతలు మృతదేహానికి నివాళులర్పించారు. శ్రీనివాసులు మాట్లాడుతూ 30 సంవత్సరాలకు పైగా పనిచేస్తున్న జోసఫ్‌కు ఒక్క రూపాయి కూడా బెనిఫిట్ ఇవ్వలేదన్నారు. వారసులకు ఉద్యోగం కల్పించకపోవడంతో బాధిత కుటుంబంలో ఆవేదనలో ఉందన్నారు. వారికి రూ.50 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలన్నారు. వారసులకు ఉద్యోగావకాశం కల్పించాలని యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించకపోతే ఆందోళన తీవ్రతరం చేస్తామని ఆయన హెచ్చరించారు.

వినాయకా.. మన్నించు


గణేష్ ఘాట్ వద్ద ఇదీ పరిస్థితి





నెల్లూరు(బృందావనం): వినాయకచవితి సందర్భంగా భక్తులు పెద్ద సంఖ్యలో విగ్రహాలను ప్రతిష్ఠించారు. అయితే నిమజ్జన విషయంలో అటు ప్రజాప్రతినిధులు, ఇటు అధికార యంత్రాంగం నిర్లక్ష్యంగా వ్యవహరించారు. ఇరుకళల పరమేశ్వరి అమ్మవారి దేవస్థానం వద్ద ఉన్న స్వర్ణాల చెరువు గణేష్ ఘాట్‌ను తగినంత నీటిని నింపలేకపోయారు. దీనికితోడు చాలాచోట్ల నుంచి ఊరేగింపుగా వచ్చేసరికి సోమవారం తెల్లవారుజామున కావడంతో విగ్రహాలను ఇష్టానుసారంగా వదిలేశారు. చాలావరకూ పూర్తిగా మునగలేదు. సగం మునిగిన ఏకదంతుని రూపాలు చూసి భక్తజనం మండిపడుతోంది. ఈ ఏడాది నాయకులను మన్నించు.. రానున్న ఏడాదైనా సరిదిద్దుకునే అవకాశమివ్వమంటూ వేడుకుంటున్నారు.

క్లుప్తంగా

బస్సు కోసం ఎదురు చూస్తుండగా..

- ట్రక్కు ఆటో ఢీకొని వృద్ధుడి మృతి

కావలి(జలదంకి) ట్రక్కు ఆటో ఢీకొనడంతో గొల్లపూడి రామకృష్ణ (78) అనే వృద్ధుడు తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతూ మృతి చెందాడు. కావలి రూరల్ పోలీసుల కథనం మేరకు.. కావలి మండలం బుడంగుంటకు చెందిన రామకృష్ణ వ్యవసాయం చేస్తుంటాడు. ఈయనకు ఒక కుమారుడు, ఒక కుమార్తె సంతానం. కుమారుడు 20 సంవత్సరాల క్రితం చనిపోయాడు. కుమార్తె జ్యోతిని కావలి మండలం ముసునూరుకు చెందిన గోసల సుబ్బరామిరెడ్డికిచ్చి వివాహం చేశాడు. ఆదివారం సాయంత్రం రామకృష్ణ కుమార్తె ఇంటికి వెళ్లేందుకు బుడంగుంట క్రాస్‌రోడ్డు వద్ద కావలికి వెళ్లే బస్సు కోసం ఎదురు చూస్తున్నాడు. ఆ సమయంలో జలదంకి వైపు నుంచి కావలి వైపునకు వచ్చే ట్రక్కు ఆటో ఆయన్ను అతి వేగంగా ఢీకొట్టింది. తీవ్రంగా గాయపడిన వృద్ధుడిని చికిత్స నిమిత్తం కావలి ఏరియా వైద్యశాలకు తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం నెల్లూరుకు తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. కావలి రూరల్ ఎస్సై తిరుమలరెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పాముకాటుకు వ్యక్తి మృతి

ఉదయగిరి: పాముకాటుకు గురై ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలోని పుల్లాయపల్లి గ్రామంలో జరిగింది. ఎస్సై కర్నాటి ఇంద్రసేనారెడ్డి కథనం మేరకు.. గ్రామానికి చెందిన రాజుపాళెం వెంకటేశ్వర్లు (50) గ్రామంలో ఇస్త్రీ పని చేస్తుంటాడు. రోజూ ఇస్త్రీ చేసేచోట నిద్రించేవాడు. ఆదివారం రాత్రి అలాగే చేశాడు. సోమవారం తెల్లవారుజామున విష సర్పం కాటేసింది. గమనించిన స్థానికులు ఉదయగిరి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం ఆత్మకూరు వైద్యశాలకు తీసుకెళ్లగా మృతిచెందాడు. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహానికి పోస్టుమార్టం చేయించి కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు ఎస్సై తెలిపారు.

కండలేరులో 37.370 టీఎంసీలు

రాపూరు:కండలేరు జలాశయంలో సోమవారం నాటికి 37.370 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఈఈ గజేంద్రరెడ్డి తెలిపారు. సోమశిల జలాశయం నుంచి కండలేరుకు 9.100 క్యూసెక్కుల నీరు చేరుతోందన్నారు. కండలేరు నుంచి సత్యసాయి గంగ కాలువకు 1,200, పిన్నేరు కాలువకు 20, లోలెవల్ కాలువకు 40, హైలెవల్ కాలువకు 100, మొదటి బ్రాంచ్ కాలువకు 60 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు వెల్లడించారు.